నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | NIZAMABAD

సునీల్‌రెడ్డి ప్రోద్బలంతోనే దాడులు

భీమ్‌గల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ నాయకులపైకి పోలీసులను ఉసిగొల్పారు
- దగ్గరుండి లాఠీచార్జి చేయించారు..
- లాఠీలకే కాదు.. తూటాలకూ వెరువం
- ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే చావబాదుతారా!
- అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తున్న ఖాకీలు
- విలేకరుల సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

భీమ్‌గల్/ మోర్తాడ్/ ఏర్గట్ల/ బాల్కొండ/వేల్పూర్, ఏప్రిల్ 17: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి భీమ్‌గల్ పర్యటనలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి పోద్బలంతోనే దాడులు జరిగాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించినందుకే పోలీసులతో దాడులు చేయించి, తమ నాయకులు, కార్యకర్తలను తీవ్రంగా గాయపరిచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాదాపు 30మంది బీఆర్ఎస్ కార్యకర్తలు గాయపడ్డారని, ఈ దౌర్జన్య కాండను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేయడమేనా.. ఇదేనా కాంగ్రెస్ ప్రజాపాలన అని ప్రశ్నించారు. లాఠీలకే కాదు తూటాలకూ తాము వెరబోమని స్పష్టం చేశారు. గురువారం వేల్పూర్, భీమ్‌గల్,మోర్తాడ్, బాల్కొండ, ఏర్గట్ల తదితర మండలాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడారు. భీమ్‌గల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేయడానికి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావును వేదికపై మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఇచ్చి ఆడబిడ్డలను ఆదుకోవాలని సామరస్య పూర్వకంగా అడిగితే.. కాంగ్రెస్ గూండాలు చొచ్చుకు వచ్చి దాడులకు తెగబడ్డారన్నారు. నిష్పక్షపాతంగా డ్యూటీ చేయాల్సిన పోలీసులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా మారి బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జీ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ గొడవలకు కాంగ్రెస్ పార్టీ నియోజక ఇన్‌చార్జి సునీల్ రెడ్డే మూల కారణమని ఆరోపించారు. పథకం ప్రకారమే అనుచరులను పురమాయించి దాడులు చేయించారన్నారు. పోలీసులకు తమ నాయకులను ఏరికోరి చూపుతూ దగ్గరుండి లాఠీచార్జీ చేయించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భీమ్‌గల్ మండలంలో మెజారిటీ రాకుండా చేసి ఓటమికి కారణమైనందుకు, ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే ఎండగట్టినందుకు కక్ష పెంచుకున్నాడని మండిపడ్డారు. ఈ దాడులకు కారణమైన సునీల్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ వారసత్వ సంస్కృతి అని విమర్శించారు.

లాఠీచార్జి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి

కొందరు పోలీసు అధికారులు కాంగ్రెస్ నాయకులకు తొత్తుగా మారుతున్నారని, వారు తమ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులపై దాడులకు పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలని పోలీసుల ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

27న వరంగల్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

గులాబీ శ్రేణుల్లో రజతోత్సవ సంబురం

'చలో ఎల్కతుర్తి'కి సమాయత్తం

ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లేందుకు నేతల ప్రణాళికలు

కార్యకర్తలకు అందుబాటులో ప్రత్యేక బస్సులు

ఇప్పటికే పూర్తయిన సన్నాహక సమావేశాలు

ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని గులాబీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. భారత రాష్ట్ర సమితి 24 ఏండ్ల ప్రస్థానం ముగించుకుని రజతోత్సవం వైపునకు పరుగులు పెడుతున్నది. ఈ నేపథ్యంలో ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఇందుకోసం అక్కడ ముమ్మర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. 25 ఏండ్ల బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో పాలుపంచుకునేందుకు పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. కాంగ్రెస్ పాలనతీరుపై విసుగెత్తి పోతున్న ప్రజలు, బీఆర్ఎస్ అభిమానులు కేసీఆర్ సభకు హాజరుకావడానికి ఆసక్తి చూపుతున్నారు.

–నిజామాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

బీఆర్ఎస్ 25 ఏండ్ల ప్రస్థానం

బీఆర్ఎస్ 25 ఏండ్ల ప్రస్థానం నేపథ్యంలో ఈ ప్రత్యేక దినోత్సవాన్ని చరిత్రలో గుర్తుండిపోయేలా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కనీవినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితి రెండున్నర దశాబ్దాల కాలంలో అనేక అద్భుత ఘట్టాలకు సాక్షాత్కారమై నిలిచింది. ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ దేశంలోనే ఒక ప్రత్యేకతను సాధించింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక ఎజెండాతో పురుడు పోసుకున్న టీఆర్ఎస్ నేడు బీఆర్ఎస్‌గా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఉద్యమ సమయంలో గులాబీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. ప్రతి జిల్లాలో ధూంధాం కార్యక్రమాలతో ప్రజల్లో రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేశారు. చారిత్రాత్మకమైన సభలతో ప్రపంచ రికార్డులను సైతం తిరగరాసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకే దక్కింది. మలి దశ ఉద్యమంలో అలుపెరగని పోరాటాల ద్వారా ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్షతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కేసీఆర్ సాధ్యం చేశారు. సమైక్యాంధ్ర పాలకుల కుట్రలను ఛేదిస్తూ, నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంటి దొంగల భరతం పడుతూ కేసీఆర్ సాగించిన ఉద్యమ కాలం చిరస్థాయిగా నిలిచిపోతుంది.

ఉద్యమాల గడ్డ వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే గులాబీ శ్రేణులతో సన్నాహక సమావేశాలు జోరుగా జరిగాయి. తొమ్మిది నియోజకవర్గాల్లో స్థానిక మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీల సమక్షంలో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఉభయ జిల్లాల్లో పర్యటించి ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, ఆశన్నగారి జీవన్ రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, జాజాల సురేందర్‌తో చర్చించి రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఈ నెల 27న ఎల్కతుర్తికి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గులాబీ శ్రేణులకు సూచనలు, సలహాలు సైతం అందించారు.

కొనసాగుతున్న ఏర్పాట్లు

తెలంగాణ తెచ్చిన పార్టీగా దేశంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన ప్రాంతీయ పార్టీగా రికార్డుకెక్కిన భారత రాష్ట్ర సమితి 25ఏండ్ల వసంతోత్సవాలను జరుపుకొంటున్న వేళ..గులాబీ శ్రేణుల్లో సంబురం కనిపిస్తున్నది. గులాబీ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రజతోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ ఆవిర్భావం రోజున అంతటా జెండా ఆవిష్కరణలు చేపట్టనున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యాలయాల్లో గులాబీ నేతలంతా సంబురాలు నిర్వహించి, అనంతరం ఎల్కతుర్తికి బయలుదేరనున్నారు. సాయంత్రం కేసీఆర్ హాజరయ్యే భారీ బహిరంగ సభకు శ్రేణులంతా హాజరవుతారు. చారిత్రక సభకు రవాణా సౌకర్యం కోసం బీఆర్ఎస్ కేంద్ర నాయకత్వం చొరవ తీసుకున్నది. ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా అద్దెకు తీసుకున్నది. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేని చోట ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సైతం అందుబాటులో ఉంచనున్నారు. కేసీఆర్ సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు ముందస్తుగా కట్టుదిట్టమైన సౌకర్యాలను కల్పించనున్నారు. కొట్లాడి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ పార్టీకే 2014, 2018లో జై కొట్టారు. అరవై ఏండ్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు తొలి ముఖ్యమంత్రిగా ప్రజలంతా పట్టం కట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బొటాబొటి ఓట్ల తేడాతో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయినప్పటికీ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను విజయవంతంగా పోషిస్తూ తెలంగాణ రాష్ట్రం, ప్రజల కోసం అలుపెరగని పోరాటాలను చేస్తున్నది.



తన కూతురు మెడిసిన్‌లో ఉత్తీర్ణత సాధించడంతో బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. 'నీ సంకల్పంపై నమ్మకంతో, నీ పట్టుదలపై ధైర్యంతో నేను ఎదురు చూసింది ఈ మధుర క్షణాల కోసమే..' అని పేర్కొన్నారు. మెడిసిన్‌లో ఉత్తీర్ణత కావడం తనకెంతో గర్వంగా ఉన్నదని తెలిపారు.

–ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 17

సీఎం రేవంత్‌పై పోలీసులకు ఫిర్యాదు

కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఎంపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదుపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భీమ్‌గల్/ మోర్తాడ్/ వేల్పూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపిస్తూ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు గురువారం కమ్మర్‌పల్లి, మోర్తాడ్, భీమ్‌గల్, వేల్పూర్ పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తాను గెలిచి అధికారం చేపట్టిన వెంటనే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఏడాదిన్నర దాటిపోతున్నా ఇప్పటివరకు హామీని నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. మోసపూరిత హామీ ఇచ్చి ప్రజలను వంచించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. భీమ్‌గల్‌లో బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొనకంటి నర్సయ్య ఆధ్వర్యంలో నాయకులు ఆర్మూర్ మహేశ్, చౌట్‌పల్లి రవి పోలీసుస్టేషన్‌కు తరలివెళ్లి ఎస్సై మహేశ్‌కు ఫిర్యాదు చేశారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్

రాజంపేట్ మండలంలోని గుండారం, ఎల్లాపూర్ తండా, నడిమి తండాల్లో కొన్నిరోజులుగా ఇసుక అక్రమ జోరుగా సాగుతున్నది. గురువారం ఇసుకను అక్రమ తరలిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎస్సై పుష్పరాజ్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి బాబా ఆధ్వర్యంలో వాగు వద్దకు వెళ్లారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దారుల్లో కందకాలను తవ్వించారు. దీంతో ఇసుక అక్రమంగా తరలిస్తున్న దారులను మూసివేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

– రాజంపేట్, ఏప్రిల్ 17

గన్నీ సంచులివ్వరు.. కాంటా చేయరు..

లింగాపూర్‌లో తహసీల్దార్‌తో తమ గోడును వెల్లబోసుకుంటున్న రైతులు

కొత్తపల్లి విండో సిబ్బందిపై రైతుల ఆగ్రహం

కోటగిరి, ఏప్రిల్ 17: రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని కాంటా చేయడంలేదంటూ మండలంలోని కొత్తపల్లి విండో పరిధిలోని లింగాపూర్, గన్నారం రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పెద్ద రైతులకే కాంటా చేస్తూ, విండో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని మండిపడ్డారు. గురువారం వారు కోటగిరి తహసీల్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ధాన్యం రోడ్లపై ఆరబోసి నెలలు గడుస్తున్నా గన్నీ సంచులు ఇవ్వడం లేదని, కాంటా కూడా చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులంటే అంత అలుసా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తహసీల్దార్ గంగాధర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే కొత్తపల్లి విండో సీఈవోతో కలిసి లింగాపూర్ చేరుకున్నారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గన్నీ సంచులు ఇవ్వడం లేదని, సీరియల్ ప్రకారం కాంటా చేస్తలేరని, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తహసీల్దార్‌కు వివరించారు. గన్నీ సంచులు అందించి, కాంటా వేసే ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని రైతులకు తహసీల్దార్ భరోసా ఇచ్చారు.

న్యాయవాదుల సహకారం వెలకట్టలేనిది

జిల్లా జడ్జి సునీత కుంచాల

జడ్జికి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్

వినాయక్‌నగర్/కంఠేశ్వర్, ఏప్రిల్ 17: తన మూడున్నరేండ్ల పదవీకాలంలో న్యాయాన్ని అందించడంలో న్యాయవాదుల సహకారం వెలకట్టలేనిదని బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆమెకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీత కుంచాల మాట్లాడుతూ.. సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు న్యాయమూర్తులుగా, న్యాయవాదులుగా సమష్టిగా శ్రమించామని అన్నారు. అనంతరం జడ్జిని బార్ ఆధ్వర్యంలో సన్మానించారు.

న్యాయమూర్తికి వీడ్కోలు పలికిన కలెక్టర్

జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఘనంగా వీడ్కోలు పలికారు. జడ్జిని కలిసి జ్ఞాపికను అందజేశారు.

జిల్లాలో పలువురు జడ్జిల బదిలీ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 17: జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి పి.పద్మావతి.. సికింద్రాబాద్ 11వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా బదిలీ అయ్యారు. సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎన్.శ్రీకాంత్ బాబు..హైదరాబాద్ –1 అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా వెళ్లనున్నారు. సీనియర్ సివిల్ జడ్జి ,అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నసీం సుల్తానా.. నాగర్‌కర్నూల్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. బోధన్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్ కుమార్‌ను హైదరాబాద్ 15వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వడ్డీ వ్యాపారులపై కొరడా

- రూ.68.22 లక్షల నగదు సీజ్..
- ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు స్వాధీనం

వినాయక్‌నగర్, మార్చి 17: నిజామాబాద్ జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఇండ్లపై పోలీసుల దాడులు కలకలం సృష్టించింది. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని పలువురు వ్యాపారుల ఇండ్లపై గురువారం దాడులు చేశారు. అధిక వడ్డీలతో సామాన్యులను వేధింపులకు గురిచేస్తున్న వ్యాపారుల భరతం పట్టేందుకు సీపీ సాయి చైతన్య ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులోభాగంగా వడ్డీ వ్యాపారుల ఇండ్లపై మెరుపు దాడులు నిర్వహించారు. అక్రమంగా ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు దాడులు చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అధిక వడ్డీవ సూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఫైనాన్స్ నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మూడు డివిజన్ల పరిధిలో రూ.68.22లక్షల నగదు, 31 ఫైనాన్షియల్, 1435 ప్రామిసరీ నోట్స్, 43 సేల్ డీడ్‌లు, 30 బాండ్ పేపర్లు, 3 వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

'కల్లు' లేక.. వింతగా ప్రవర్తిస్తూ..

- మల్లాపూర్‌లో పెరుగుతున్న బాధితులు
- చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 17: నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో 'కల్లు' బాధితులు వింతగా ప్రవర్తిస్తున్నారు. ఇటీవల కల్తీ కల్లు తాగి సుమారు 80 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్యం అందించారు. ఈ నేపథ్యంలో అనుమతిలేని కల్లు దుకాణాలను ఎక్సైజ్ శాఖ అధికారులు మూసివేయించారు. కానీ ప్రస్తుతం గ్రామాల్లో కల్లుకు అలవాటు పడిన కొందరు వింతగా ప్రవర్తిస్తున్నారు. ముఖ్యంగా బీర్కూర్ మండలం మల్లాపూర్‌లో బాధితుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. ఈ విషయం తెలుసుకున్న వైద్యశాఖ అధికారులు గ్రామానికి చేరుకొని బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా కొందరు వృద్ధులు మాట్లాడుతూ.. తమకు కల్లు అలవాటయ్యిందని, కల్లు తాగకపోతే నిద్ర కూడా సరిగ్గా రావడంలేదన్నారు. మరికొందరు వింతగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. అయితే కొంతమంది బాధితులు గ్రామంలోని రోడ్డుపైకి చేరుకొని కల్లు కావాలని నిరసన చేపట్టడం గమనార్హం.

బీర్కూర్ మండలం మల్లాపూర్‌లో వింతగా ప్రవర్తిస్తున్న వృద్ధురాలిని పట్టుకున్న స్థానికులు